సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 5 । నవంబర్ । 2024



సంక్షేమాన్ని విస్మరించిన సర్కార్

రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని పాడేరు ఎమ్మెల్యే, మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. 8లో



ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని, జీవో నంబర్ 3 ని పునరుద్ధరించాలని ఆదివాసీ నిరుద్యోగులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. 8లో



సమస్యల పరిష్కారానికి అంగీకారం

కాఫీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఏపీఎఫ్‌డీసీ అధికారులు అంగీకరించారు. 8లో

హరహర మహాదేవ

- శివనామస్మరణతో హోరెత్తిన ఆలయాలు
- ఘనంగా కార్తీకమాస తొలి సోమవారం పూజలు



పాడేరులో భక్తులకు ఉచితంగా ప్రసాదం,పాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు దంపతులు



అరకులోయలోని మల్లికార్జున స్వామికి పూజ చేస్తున్న అర్చకుడు



పాడేరులో ఉమానీలకంఠేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

సాక్షి,పాడేరు: కార్తీకమాసం తొలిసోమవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హరనామస్మరణతో ఆలయాలు హోరెత్తాయి. ఆధ్యాత్మిక,పర్యాటక కేంద్రం మత్స్యగుండంలోని మత్స్యలింగేశ్వరస్వామి, బొర్రాగుహలోని శివలింగాన్ని భక్తులు దర్శించుకున్నారు. పాడేరులోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ఆలయ కమిటీ ఉచితంగా ప్రసాదాన్ని పంపిణీ చేసింది.మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు, ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు, రమాదేవి,ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం భక్తులకు ఈ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అరకులోయలోని భ్రమరాంబదేవి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో తొలిసోమవారం పూజలు ఘనంగా జరిగాయి.

హడలెత్తిస్తున్న చలి

- జిల్లాలో తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- అరకులోయలో 15.8 డిగ్రీలు
- మినుములూరులో 17 డిగ్రీలు
- చింతపల్లిలో 18 డిగ్రీలు నమోదు



జి.మాడుగుల మండలం నిట్టాపుట్టులో చలిమంట కాగుతున్న వృద్ధులు



పాడేరు పాతబస్టాండ్ మార్కెట్‌లో పొగమంచు

సాక్షి,పాడేరు: జిల్లావ్యాప్తంగా చలిగాలులు ప్రారంభమయ్యాయి. ఆదివారం నుంచి ఉష్ణోగ్రతలు తగ్గుతుండడంతో చలిగాలులు వీస్తున్నాయి. ప్రారంభంలోనే చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సోమవారం వేకువజామున చలివణికించింది. ఉదయం 9గంటల వరకు పొగమంచు వీడలేదు. చలి పెరగడంతో ప్రజలు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. అరకులోయలో చలిప్రభావం అధికంగా ఉంది. సోమవారం అరకులోయలోని కేంద్ర కాఫీబోర్డు వద్ద 15.8 డిగ్రీలు,పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీ బోర్డు వద్ద 17 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 18 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలికాలం ప్రారంభమవడంతో ఉష్ణోగ్రతలు తగ్గే పరిస్థితి ఉంటుందని చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి **తెలిపారు.**

న్యూస్‌రీల్

త్వరలో వినియోగంలోకి సీలేరు మొదటి యూనిట్

సీలేరు: సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో మొదటి యూనిట్‌ను సోమవారం రాత్రి మెకానికల్ స్పిన్నింగ్‌లో పెట్టినట్టు ఈఈ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. 60 మెగావాట్ల సామర్థ్యం ఉన్న మొదటి యూనిట్‌లో ఆగస్టు 2న సాంకేతిక లోపాలు తలెత్తడంతో విద్యుత్ ఉత్పత్తిని నిలిపేశారు. యూనిట్ మరమ్మతు పనులను అభిరాం కంపెనీకి అప్పగించడంతో యూనిట్‌లో నెలకొన్న అలైన్‌మెంట్ సమస్యను గుర్తించి, స్టార్టర్ షాఫ్ట్ బేరింగ్‌లు కొత్తవి అమర్చి, సాంకేతిక లోపాలను సరిచేశారు. ఈ పనులు సోమవారం సాయంత్రానికి ముగియడంతో జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ ఈఈ.. యూనిట్‌కు పూజా కార్యక్రమాలు నిర్వహించి యూనిట్‌ను మెకానికల్ స్పిన్నింగ్‌లో ఉంచారు. మంగళవారం ఉదయం వరకు మెకానికల్ స్పిన్నింగ్‌లో ఉంచి టెంపరేచర్, మెగ్గర్ వాల్యూస్ సక్రమంగా ఉన్నట్లయితే యూనిట్‌ను సింక్రనైజ్ చేసి త్వరలోవినియోగంలోకి తీసుకురానున్నట్లు ఈఈ తెలిపారు. కార్యక్రమంలో సీలేరు కాంపెక్స్ ఎస్ఈ రామభద్రరాజు, ఈఈ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

6న వినికిడి సమస్యలపై ప్రత్యేక వైద్య శిబిరం

పాడేరు : వినికిడి సమస్యలతో బాధపడుతున్న వారి కోసం ఈనెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు పాడేరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం (ఆర్‌బీఎస్‌కే)లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ జమాల్‌బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ కార్యక్రమం(ఎన్‌పీపీసీడీ)లో భాగంగా దీన్ దయాల్ శ్రావణ ఫౌండేషన్ ద్వారా ఉచిత ప్రోగ్రమబుల్ హియరింగ్ హెడ్స్ పంపిణీ కోసం ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. క్యాంప్‌నకు వచ్చే వారు ఆధార్, రేషన్ కార్డులు, రెండు పాస్ ఫొటోలు, గతంలో వినికిడి పరీక్ష చేయించుకున్న వారు ఆడియోగ్రాఫ్ రిపోర్ట్ తీసుకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం మేనేజర్ వై.కిశోర్‌కుమార్ (ఫోన్ 08935293913)ను సంప్రదించాలని తెలిపారు.

సీలేరులో షూటింగ్ సందడి



మారెమ్మ ఆలయంలో కెమెరా ఆన్ చేస్తున్న సినిమా బృందం

సీలేరు: కొత్త హీరోహీరోయిన్లతో మదం అనే టైటిల్‌తో నిర్మిస్తున్న సినిమా షూటింగ్ ఆదివారం ఉదయం సీలేరులో ప్రారంభమైంది. మారెమ్మ ఆలయంలో తొలి షాట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు ఎం.వంశీకృష్ణ మాట్లాడుతూ సీలేరు బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా ఎమోషనల్ రివేంజ్ డ్రామాలో సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెమెరామెన్ రవికుమార్,ఎడిటర్ నందమూరి తారకరామరావు, సీఈవో శాంతయ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈవైకా హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో సూర్యదేవర రవీంద్రనాథ్, కోయ రమేష్ బాబు నిర్మాణ సారథ్యంలో సినిమాను నిర్మిస్తున్నామని, ఈ సినిమాలో హర్ష గంగవరపు,అనురూప్ కటారి,లతా విశ్వనాథ్ రెడ్డిలు హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారని దర్శకుడు వంశీకృష్ణ తెలిపారు.

ఆదర్శ వ్యవస్థకు తూట్లు!



కార్యదర్శి పోస్టు లేని పాడేరులోని నంబర్-2 సచివాలయం

విసిరేసినట్టు దూరంగా కొండల మధ్య ఉండే గ్రామాలు.. ఆయా గ్రామస్తులు మండల కేంద్రాలకు చేరాలంటే తీవ్ర వ్యయ ప్రయాసలకు గురికావల్సిందే... కష్టనష్టాలకు ఓర్చి అక్కడికి వెళితే పనుల సంగతి దేవుడెరుగు కనీసం అధికారుల దర్శనభాగ్యం కూడా లభించేది కాదు... వారాలు, నెలల తరబడి తిరిగితే, అదృష్టం ఉంటేనే ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరిగే పరిస్థితి... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయాల ఆవిర్భావంతో గిరిజనుల చెంతకే పాలన వచ్చింది. గ్రామాల్లోనే సచివాలయాలు ఏర్పాటయ్యాయి. అర్జీలు అందజేసిన గంటల వ్యవధిలోనే పనులు జరిగాయి. కాలుకదిపే అవసరం లేకుండా ఇంటికే వచ్చి వలంటీర్లు రేషన్‌కార్డులు, ధ్రువీకరణ పత్రాలు, పింఛన్లు అందజేశారు. గ్రామ పాలనలో కీలక పాత్ర పోషిస్తున్న సచివాలయ వ్యవస్థపై కక్ష కట్టిన కూటమి ప్రభుత్వ చర్యలతో మళ్లీ గిరిజనులు దురావస్థలకు గురికాక తప్పని పరిస్థితులు దాపురించాయి.

- గ్రామ సచివాలయ వ్యవస్థ నిర్వీర్యానికి కుట్ర
- కార్యదర్శుల పోస్టులకు ఎసరు
- 126 మంది గ్రేడ్–5 కార్యదర్శులు మైదాన ప్రాంతాలకు బదిలీ
- గిరిజన సంక్షేమంపై కూటమి ప్రభుత్వం వివక్ష
- ఇబ్బందులు పడుతున్న జిల్లా వాసులు



మైదాన ప్రాంతాలకు బదిలీ అయిన గ్రామ సచివాలయాల కార్యదర్శులు

సాక్షి,పాడేరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చి గిరిజనులకు పాలనను దగ్గరచేస్తే, కూటమి ప్రభుత్వం మాత్రం గిరిజనుల సంక్షేమంపై విషం కక్కుతోంది. దేశానికే ఆదర్శంగా నిలిచిన ఈ వ్యవస్థను నీరుగార్చేలా వ్యవహరిస్తోంది. ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థను లేకుండా చేసిన ప్రభుత్వం, తాజాగా సచివాలయాల గ్రేడ్–5 కార్యదర్శులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయడంతో పాటు, ఉన్న ఉద్యోగులను కేవలం పింఛన్ పంపిణీ తదితర పనులకే పరిమితం చేసి వ్యవస్థను దెబ్బతీసేలా వ్యవహరిస్తోంది. దీంతో గ్రామపాలన అస్తవ్యవస్తంగా తయారవుతోంది. సచివాలయాలు, హెల్త్ క్లినిక్ లు, ఆర్బీకేలపై కత్తి కట్టిన ప్రభుత్వం జిల్లాలో వాటి భవన నిర్మాణాలను నిలిపివేసినట్టు తెలిసింది. గ్రామసచివాలయాల పరిధిలోనే గిరిజనులు తమ సమస్యలను సచివాలయాల కార్యదర్శుల ద్వారా పరిష్కరించుకునేవారు.దూరంగా ఉన్న మండల కేంద్రాలకు వెళ్లవలసిన పరిస్థితి ఉండేది కాదు. గ్రామ సచివాలయాల్లో అన్ని రకాల పౌరసేవలు అందుబాటులో ఉండేవి. గిరిజనులపై కక్షకట్టిన కూటమి ప్రభుత్వం వారికి ఎంతో మేలు చేసిన గ్రామసచివాలయాల వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. జిల్లాలోని 126 గ్రామసచివాలయాల్లో పనిచేసే గ్రేడ్–5 కార్యదర్శులను డ్రాయింగ్ పవర్ పేరిట మైదాన ప్రాంతాలకు బదిలీ చేసింది. ఈ పోస్టుల్లో కొత్తగా కార్యదర్శులను నియమించకపోవడం, కొన్ని ప్రాంతాల్లో ఇన్‌చార్జ్‌లతో నిర్వహిస్తుండడంతో గ్రామ సచివాలయా లు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

ప్రభుత్వానికి విన్నవించుకున్నా...

మైదాన ప్రాంతాలకు బదిలీ అయిన 126మంది కార్యదర్శులు తమకు డ్రాయింగ్ పవర్ ఇచ్చి ఇక్కడే కొనసాగించాలని,ఆయా పోస్టులను ఖాళీగా ఉంచవద్దంటూ పంచాయతీరాజ్ కమిషనర్,ఇతర ప్రభుత్వ పెద్దలకు విన్నవించుకున్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కూడా కలిసారు.కానీ బదిలీలు ప్రక్రియను కొనసాగించి వారందరిని మైదాన ప్రాంతాలకు ప్రభుత్వం పంపింది.వారి పోస్టులను మాత్రం ఖాళీగా ఉంచడంతో గిరిజనులకు నష్టం ఏర్పడింది.భవిష్యత్‌లో ఈ పోస్టులు లేకుండా గ్రామసచివాలయాల వ్యవస్థను ఎత్తివేసే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతాలను మొదటిగా ఎంచుకున్నట్టు ప్రచారం జరుగుతోంది.

జిల్లాలో గిరిజనులకు విశేష సేవలందించిన గ్రేడ్–5 సచివాలయాల కార్యదర్శులు 190 మంది గిరిజనులే.వారిలో 126 మందిని ప్రభుత్వం గత నెలలో అనకాపల్లి,కాకినాడ ప్రాంతాలకు బదిలీ చేసింది. అరకులోయ నియోజవర్గం నుంచి 72 మందిని బదిలీ చేశారు. జిల్లాలో ప్రస్తుతం 64 మంది మాత్రమే పనిచేస్తున్నారు. జిల్లా కేంద్రం పాడేరులో మూడు గ్రామసచివాలయాలు, అరకులోయలోని పెదలబుడులో 3 గ్రామ సచివాలయాల్లో గ్రేడ్–5 కార్యదర్శులు అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో ఇక్కడ పరిపాలన గాడి తప్పింది. పాడేరులో 3 సచివాలయాలకు ఈవోపీఆర్‌డీ,అరకులోయలోని పెదలబుడులో 3 సచివాలయాలకు ఒక పంచాయతీ కార్యదర్శి ఇన్‌చార్జిలుగా పనిచేస్తున్నారు.ఇలా జిల్లాలో అనేక గ్రామ సచివాలయాల్లో కార్యదర్శులు లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కార్యదర్శులు లేక ఇబ్బందులు



పెదలబుడు పంచాయతీ పరిధిలో రెండు గ్రామసచివాలయాల్లో కార్యదర్శులను మైదాన ప్రాంతానికి బదిలీ చేయడంతో ఆ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ప్రజలు వివిధ పనుల కోసం గ్రామసచివాలయాలకు వెళుతున్నప్పటికీ గతంలో వలే పనులు త్వరితగతిన జరగడం లేదు.ఈ సచివాలయాలకు ఒక్కరే ఇన్‌చార్జిగా ఉండడంతో పనుల నిర్వహణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అన్ని సచివాలయాలకు వెంటనే కార్యదర్శులను నియమించాలి.

–ఎస్.ఆనంద్,
పెదలబుడు పంచాయతీ, అరకులోయ మండలం

కుంటుపడిన పాలన



సీతగుంట గ్రామ పంచాయతీకి కార్యదర్శి బదిలీపై వెళ్లడంతో పనులు జరగక ఇక్కట్లకు గురవుతున్నాం. సీకరి గ్రామ సచివాలయం కార్యదర్శికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జి కార్యదర్శితో సకాలంలో పనులు కాక అవస్థలు పడుతున్నాము. గ్రామ పాలన కుంటుపడుతోంది. ప్రభుత్వం స్పందించి పూర్తి స్థాయిలో నియమించాలి.

– గందేరు జీవన్‌కుమార్,వార్డు సభ్యులు,
సీతగుంట పంచాయతీ, పెదబయలు మండలం

ఇబ్బందులు లేకుండా చర్యలు

జిల్లాలోని 126 మంది గ్రామసచివాలయాల కార్యదర్శులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయడంతో వారందరికీ డ్రాయింగ్ పవర్ అందుబాటులోకి వచ్చింది.బదిలీలు జరిగిన చోట గ్రేడ్–4,ఇతర కార్యదర్శులను నియమిస్తున్నాం.ప్రజలకు పరిపాలన పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– పి.ఎస్.కుమార్,
డీఎల్‌పీవో,పాడేరు

మానసిక వేదనతోనే ఎంపీటీసీ మృతి

- ఇది ప్రభుత్వ కక్షసాధింపు చర్యే
- జీసీసీ డీఎంపై చర్య తీసుకోవాలి
- ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి డిమాండ్



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

రంపచోడవరం: బందపల్లి ఎంపీటీసీ ముచ్చిక సాయిబాబు దొర(50) మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి అన్నారు. గుండెపోటు రావడంతో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందారు. గిరిజన సహకార సంస్థలో కాంట్రాక్ట్ పద్ధతిలో డ్రైవర్‌గా పనిచేస్తున్న సాయిబాబును ఎటువంటి కారణం లేకుండా తొలగించడంతో తీవ్ర మానసిక వేదనకు గురైనట్టు ఎంపీపీ, జెడ్పీటీసీ తెలిపారు. ఆయన స్థానంలోమరొకర్ని నియమించారన్నారు. ఉద్యోగం కోసం పలుమార్లు జీసీసీ డీఎంను సాయిబాబు దొర కలిసినా పైనుంచి వచ్చిన ఆదేశాలు ఏం చేయలేమని చెప్పారని, ప్రభుత్వం మారిన వెంటనే ఉద్యోగం నుంచి తొలగించడం కక్ష సాధింపు చర్యేనని ఆరోపించారు. ఉద్యోగం పోవడంతో ఇద్దరు ఆడపిల్లలను ఎలా చదివించాలని ఆవేదన చెందేవాడని వారు చెప్పారు. తొమ్మిది సంవత్సరాలుగా పనిచేస్తున్న సాయిబాబుదొరను ఎటువంటి కారణాలు లేకుండా తొలగించిన జీసీసీ డీఎంపై చర్యలుతీసుకోవాలని డిమాండ్‌చేశారు. పార్టీ తరపున సాయిబాబు కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.సాయిబాబు మృతదేహం వద్ద వైఎస్సార్‌సీపీమండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, సర్పంచ్ మంగా బొజ్జయ్య, నాయకులు పండా రామకృష్ణదొర, బొబ్బా శేఖర్ నివాళులర్పించారు.

జిల్లా అభివృద్ధికి పంచ సూత్రాలు



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి, చిత్రంలో కలెక్టర్ దినేష్‌కుమార్, ఎంపీ తనూజ రాణి,జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యేలు మత్స్యలింగం,శిరీషా దేవి

- జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి
- సమస్యలపై గళం విప్పిన ప్రజాప్రతినిధులు

సాక్షి,పాడేరు: జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ముఖ్యంగా ఐదు అంశాలు తాగునీరు, సాగు నీరు, విద్య, వైద్యం, రహదారుల సౌకర్యాల కల్పనపై ప్రణాళికలు రూపొందించి, ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లాఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మంత్రి అధ్యక్షతన తొలిసారిగా సోమవారం జిల్లా కేంద్రం పాడేరులో నిర్వహించిన జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలన్నారు. ముందుగా మంత్రితో పాటు కలెక్టర్ దినేష్‌కుమార్,ఎస్పీ అమిత్ బర్దర్,అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. జిల్లాలో అభివృద్ధి, సమస్యలపై చర్చించారు. పలువురు ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ ప్రాంతాల్లో సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

పంచాయతీరాజ్‌కు ఉపాధి నిధులు కేటాయించాలి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌శాఖకు కేటాయించాలని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర డిమాండ్ చేశారు.ఐటీడీఏల పరిధిలో గిరిజన సంక్షేమశాఖకు ఉపాధి నిధులు కేటాయించడం అన్యాయమన్నారు. ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో వైద్యులు,సిబ్బందిని నియమించి,నివాస గృహాలు నిర్మించాలని కోరారు.జిల్లా పరిషత్,ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంపై దృష్టి పెట్టి, వారికి న్యాయం చేయాలన్నారు. చట్రాపల్లి వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి

రంపచోడవరం ప్రాంతీయ ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి కోరారు. దేవీపట్నం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో తాగునీటితో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

తాగునీరు లేక ఇక్కట్లు

మారుమూల పంచాయతీల్లో తాగునీరు,రహదారుల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని కక్కి ఎంపీటీసీ సీహెచ్.మీనా తెలిపారు. జల్‌జీవన్‌మిషన్ పనులు కూడా ఇంకా పూర్తి కాలేదని చెప్పారు. దీంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారని తెలిపారు. వంట్లమామిడి, ఐనాడ,సలుగు,దేవాపురం పంచాయతీల పరిధిలో సమగ్ర సర్వే జరిపి తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు రోడ్లు నిర్మించాలని ఆమె జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కోరారు. సమావేశంలో జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్,ఐటీడీఏ పీవోలు అభిషేక్,సింహాచలం,అపూర్వభరత్,సబ్‌కలెక్టర్‌లు సౌర్యమన్ పటేల్,కల్పశ్రీ,డీఆర్‌వో పద్మావతి,అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంకుల సేవలు విస్తరించాలి

జిల్లాలో ఆస్పత్రుల సంఖ్య అధికంగా ఉందని, మెడికల్ కళాశాల కూడా ప్రారంభమవడంతో బ్లడ్ బ్యాంకుల సేవలను విస్తరించి,అత్యవసర పరిస్థితుల్లో రోగులకు,గర్భిణులకు,సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తం అందుబాటులో ఉంచాలని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజ రాణి సూచించారు.

అదనంగా అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో లైంగికదాడులు, హత్యలు జరుగుతున్నాయని, బాలికలు, మహిళలకు రక్షణ కల్పించే విధంగా దిశా యాప్‌ను కొనసాగించాలని కోరారు. గంజాయి నుంచి యువతను కాపాడాలన్నారు. సికిల్‌సెల్ ఎనిమియా కేసులు అల్లూరి జిల్లాలోనే అధికంగా ఉన్నాయని, వైద్య ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ వ్యాధిగ్రస్తులకు రూ.10వేల చొప్పున పింఛన్‌ను పంపిణీ చేశామని చెప్పారు.వరదలతో చట్రాపల్లిలో నివాసాలు కోల్పోయిన బాధితులకు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేపట్టాలని ఎంపీ కోరారు.

100 శాతం టీచర్ పోస్టులు గిరిజనులకే...

గిరిజన ప్రాంతాలలోని 100శాతం ఉపాధ్యాయ ఉద్యోగాలను గిరిజనులకే కల్పించాలని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కోరారు. జీవో నంబర్ 3 పునరుద్ధరణ,నూరుశాతం ఉద్యోగాల కల్పన హామీకి కూటమి ప్రభుత్వం కట్టుబడాలన్నారు.జీవో నంబర్ 3కి ప్రత్యామ్నాయంగా మరో జీవోను తీసుకువచ్చి గిరిజన అభ్యర్థులకు నిరుద్యోగ సమస్య లేకుండా చూడాలన్నారు.గిరిజన ప్రాంతానికి జాతీయ గ్రామీణా ఉపాధి హామీ పథకం నిధులను వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. గిరిజన భూ చట్టాలను పరిరక్షించాలని కోరారు.రెవెన్యూ అధికారులు అక్రమంగా భూముల రిజిస్ట్రేషన్లను జరుపుతున్నారన్నారు.అనంతగిరి మండలంలోని నాన్‌షెడ్యూల్ ఏరియాలో భూముల ఆక్రమణలను నిలువరించని పక్షంలో గిరిజనులంతా భూములు కోల్పోయి జీవనాధారానికి దూరమయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం ఈ సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు.

పర్యాటక కేంద్రాల్లో ప్రత్యేక నిఘా

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

అరకులోయ రూరల్: పర్యాటక కేంద్రాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్ఐ గోపాల్‌రావును ఆదేశించారు. రానున్న మూడు నెలల్లో జిల్లాలకు వచ్చే సందర్శకుల సంఖ్య బాగా పెరుగుతుందని, పర్యాటక ప్రాంతాల్లో నిఘా మరింత పెంచాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని ఆదేశించారు. అరకులోయ పరిసరాల ప్రాంతాల్లో ఉన్న లాడ్జీలు,రిసార్టులు, వ్యాపార సముదాయల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గంజాయి,డ్రగ్స్ విక్రయాలపై..

పర్యాటక కేంద్రాల్లో గంజాయి, డ్రగ్స్, సారా, గుట్కాల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. వీటి వల్ల కలిగే అనర్థాలగురించి గ్రామాల్లో ప్రజలకు వివరించాలని సూచించారు. పాఠశాలలు,కళాశాలల్లో నిత్యం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించి, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

క్లుప్తంగా

ఏకలవ్య పాఠశాల డార్మెటరీల పరిశీలన



పాఠశాలను సందర్శించిన పీవో సింహాచలం

రాజవొమ్మంగి : మండలకేంద్రం రాజవొమ్మంగిలోని ఏకలవ్య పాఠశాలలో రెండో ఫేజ్‌లో నిర్మించిన బాలుర,బాలికల డార్మెటరీ బ్లాకులను రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సోమవారం పరిశీలించారు. వీటిని ప్రారంభించి పిల్లలను వెంటనే ఈ కొత్త భవనాల్లోకి తరలించాలని ప్రిన్సిపాల్ కృష్ణారావును ఆదేశించారు. ఇదే ప్రాంగణంలో నిర్మాణం పూర్తయిన స్టాఫ్ క్వార్టర్స్‌ను కూడా తనిఖీ చేశారు. పిల్లలు ఏ విధంగా చదువుతున్నదీ, మెనూ ఏ విధంగా అమలవుతోంది తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రిన్సిపాళ్లు ఎం.వి. కృష్ణారావు, అరుణ్ పురోహిత్ పాల్గొన్నారు.

సమస్యలపై వెల్లువెత్తిన వినతులు



వినతులు స్వీకరిస్తున్న అధికారులు రమణ, జాన్‌రాజ్

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఐటీడీఏ ఏపీవో జనరల్ డి.రమణ, గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్‌రాజ్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ వివిధ సమస్యలపై 30 వినతులు అందినట్టు చెప్పారు. ఇందులో దేవీపట్నం తున్నూరు పంచాయతీలో మామిడివలస, చింతలగూడెం, రంపచోడవరం మండలంలోని కింటుకూరు గ్రామాలకు సెల్ టవర్ ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వాలని కోరుతూ తున్నూరు పంచాయతీ సర్పంచ్ సాధల విజయభాస్కర్ రెడ్డి, సాధల కళ్యాణి, బి.శ్రీదేవి వినతి సమర్పించారు. వై.రామవరం మండలం చింతలపూడి గ్రామంలోని చెక్ డ్యాం ఏర్పాటు చేయాలని సర్పంచ్ పల్లాల సన్యాసమ్మ దరఖాస్తు చేసుకున్నారు. మారేడుమిల్లి మండలం పందిరి మామిడి కోట గ్రామంలో నీటి పథకం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు రేవుల జానకి రెడ్డి, రేవుల రామకృష్ణారెడ్డి వినతి అందజేశారు. పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్ , డీఈవో (ఏజన్సీ) వై.మల్లేశ్వరరావు, డీఎల్‌పీవో రఘునందన్, డాక్టర్ వెంకట ఇందిరా, ఏడీఎంహెచ్ఓ జి. శిరీష, ఈఈ సుబ్బయ్య, తహసీల్దార్ టి.రామకృష్ణ ఎంపీడీవో పి.జయంతి, సీడీపీవో సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి అంగీకారం

- చర్చలు సఫలీకృతం
- వేతనాలు పెంచుతున్నట్టు రీజనల్ మేనేజర్ డాక్టర్ జ్యోతి ప్రకటన



కాఫీ కార్మికులతో చర్చిస్తున్న రీజనల్ మేనేజర్ జ్యోతి

చింతపల్లి:కాఫీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఏపీఎఫ్‌డీసీ అధికారులు అంగీకరించారు. దినసరి కూలి, పండ్ల సేకరణ ధరలు, ప్లాంటేషన్ హెల్పర్ల వేతనం పెంచుతూ రీజనల్ మేనేజర్ డాక్టర్ టి.జ్యోతి ప్రకటించారు. దీంతో కార్మిక సంఘాల నాయకులు ఆందోళనలు విరమిస్తున్నట్టు ప్రకటించారు. వివరాల్లోకి వెళితే, అక్టోబరు 15న పది డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును కార్మిక సంఘాల నాయకులు ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యానికి అందజేశారు. ఈ మేరకు గత నెల 19న మొదటి విడత చర్చలు డివిజనల్ మేనేజర్లు, కాఫీ కార్మిక సంఘాల నాయకుల మధ్య జరిగాయి. అయితే ఈ చర్చలు ఫలించలేదు. దీంతో సోమవారం మరోసారి రీజనల్ మేనేజర్, డివిజనల్ మేనేజర్లతో కాఫీ కార్మిక సంఘాల నాయకులు చర్చలు నిర్వహించారు. ఈ చర్చల్లో ప్రధానంగా కాఫీ పండ్ల సేకరణ ధర రూ.5.60 నుంచి రూ.6.10పైసలు, దినసరి కూలీ రూ.299 నుంచి రూ.331గా పెంచారు. అలాగే ప్లాంటేషన్ హెల్పర్లకు వేతనం రూ. 11వేల నుంచి రూ.13,500గా పెంచారు. పెంచిన వేతనాలు డిసెంబరు నుంచి అమలులోకి వస్తాయన్నారు. అలాగే కాఫీ కార్మికుల వసతి గృహాల మరమ్మతులను మూడు నెలల్లో చేపడతామని ప్రకటించారు. గతంలో మాదిరిగా నెలవారీ వేతనాల చెల్లింపులు ఉండవని, వారానికి వేతనాలు చెల్లిస్తున్నట్టు పేర్కొన్నారు. గ్రూపు ఇన్సూరెన్సు వర్తింప జేస్తామన్నారు. ఏడాదికి రెండు పంగ రోజుల్లో ఐదు దినాల కూలి బోనస్‌గా అందజేస్తామని ప్రకటించారు. కాఫీ తోటల్లో కార్మికులు ప్రమాదానికి గురైతే కోలుకునే వరకు ఏపీఎఫ్‌డీసీ ఖర్చులతో చికిత్స అందిస్తామన్నారు. అలాగే ప్రమాదంలో మరణిస్తే రూ.రెండు లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తామన్నారు. కార్మికులకు 26 రోజుల పనిదినాలు కల్పిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ప్లాంటేషన్ కండక్టర్లను నియమించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్తామన్నారు. అవసరం నిమిత్తం 35 మందిని నియమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈఅంశాలను అంగీకార పత్రంలో నమోదు చేసి కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా కాఫీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ కాఫీ కార్మికుల హక్కులు సాధించుకోవడంలో విజయం సాధించామన్నారు. డివిజనల్ మేనేజర్లు కృష్ణబాబు, రత్నదీపిక, సత్యలింగం, కాఫీ కార్మిక జిల్లా అధ్యక్షురాలు కనకవల్లి, ప్రధాన కార్యదర్శి సుందరరవు, నాయకులు సత్యనారాయణ, గిరి, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మైదానంలో చెత్త తొలగింపు

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పేరుకుపోయిన దీపావళి బాణసంచా సామగ్రి తొలగింపు పనులకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. కళాశాల మైదానంలో పేరుకుపోయిన చెత్త వల్ల విద్యార్థులు, స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'మైదానం..అధ్వానం' శీర్షికతో ఈనెల 4న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్‌లు స్పందించారు. మైదానంలో మొత్తం చెత్తను తొలగించి, పరిశుభ్రం చేసి విద్యార్థుల ఆటలకు సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ, డివిజనల్ పంచాయతీ అధికారులను కలెక్టర్, పీవోలు ఆదేశించారు. వారి ఆదేశాలతో పాడేరు మేజర్ పంచాయతీ అధికారులు అప్రమత్తమై కార్మికులతో చెత్తను తొలగించే పనులు సోమవారం చేపట్టారు. పంచాయతీ కార్మికులు చెత్తను సేకరించి వాహనాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించే పనులు సాయంత్రం వరకు జరిపారు. మైదానంలో చెత్తను తొలగించడంపై జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మైదానంలో పేరుకుపోయిన చెత్త సమస్యను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కరించిన 'సాక్షి' దినపత్రికకు, సమస్యపై తక్షణమే స్పందించిన కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్‌లకు విద్యార్థులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.




పాడేరు జూనియర్ కళాశాల మైదానంలో చెత్తను తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

సిబ్బంది నియామకం

హుకుంపేట: తీగలవలస గ్రామ సచివాలయంలో సిబ్బంది లేక ఇబ్బందులు అనే శీర్షికతో 'సాక్షి'లో ఈనెల 3వ తేదీన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. తడిగిరి పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న ఆమోస్, చంద్రశేఖర్‌లను అధికారులుగా తాత్కాలికంగా నియమించారు.



తాత్కాలిక సిబ్బందిని నియమిస్తున్నట్టు అధికారులు జారీ చేసిన ఉత్తర్వులు

గిరిజనుల సంక్షేమానికి కృషి



గ్యాస్ సిలెండర్లు పంపిణీ చేస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

- గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి

సాక్షి,పాడేరు: రానున్న రెండేళ్లలో రూ.1800 కోట్లతో 1300 గ్రామాలకు రోడ్లు నిర్మిస్తామని జిల్లా ఇన్‌చార్జి, గిరిజన, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఆమె సోమవారం పాడేరులో పర్యటించారు. ముందుగా ఘాట్ రోడ్డులోని మోదకొండమ్మతల్లికి పూజలు చేశఋూరు. అనంతరం బంగారుమెట్ట గ్రామంలో ఉచిత గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పాడేరు-వడ్డాది రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. స్థానిక గురుకుల కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ డోలిమోత లేని గ్రామాలు లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఎన్నికల్లో అరకు, పాడేరు అసెంబ్లీ, అరకు పార్లమెంట్ ఓడిపోవడం ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు తమకు బాధగా ఉందన్నారు. అయినప్పటికీ గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. సీలేరు రోడ్డు అభివృద్ధికి రూ.46కోట్లు మంజూరు చేశామన్నారు. గిరిజన విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులకు త్వరలో కాస్మోటిక్స్‌ను పంపిణీ చేస్తామన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, జేసీ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, కిడారి శ్రావణ్‌కుమార్, గిడ్డి ఈశ్వరి, దొన్నుదొర తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా



కించుమండ వంతెన వద్ద అదుపు తప్పిన కారు

- స్వల్ప గాయాలతో బయటపడ్డ టూరిస్టులు

దుంబ్రిగుడ: మండలంలోని కించుమండ సంతబయలులో జాతీయ రహదారి కోసం నిర్మిస్తున్న వంతెన సమీపంలో సోమవారం పాడేరు వైపు నుంచి అరకులోయ వస్తున్న టూరిస్టు కారు అదుపు తప్పి బోల్తాపడింది. కారులో ఉన్న పర్యాటకులు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ప్రమాదానికి గురైన కారును స్థానికుల సహాయంతో బయటకు తీశారు.

సంక్షేమాన్ని విస్మరించిన సర్కార్

- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత
- పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

గూడెంకొత్తవీధి: రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. సోమవారం స్థానిక కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, సీనియర్‌లు, కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. ప్రతి ఇంటికీ పథకాలు అందజేశారని చెప్పారు.

మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేని దుస్థితిలో ఉందన్నారు. దీంతో కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని చెప్పారు. స్వార్థ ప్రయోజనాలకోసం కొందరు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర నాయకులు వైఎస్సార్‌సీపీని వీడి కూటమి పార్టీల కండువాలు కప్పుకున్నంతమాత్రాన జిల్లాలో వైఎస్సార్‌సీపీకి వచ్చిన నష్టమేమీ లేదన్నారు. పార్టీలు మారే నేతలకు విలువ ఉండదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అధికారం వైఎస్సార్‌సీపీదేనని ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ బోయినకుమారి, చింతపల్లి జెడ్పీటీసీ బాలయ్య, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్, ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, మాజీ జెడ్పీటీసీ మత్స్యరాజు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ సీనియర్ నాయకులు గిరి, అంజి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముంబయి వాసి దుర్మరణం



షిజి పుయత్(ఫైల్)



సంఘటనా స్థలిలో షిజి పుయత్ మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: విధులకు వెళ్తున్న ముంబయికి చెందిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు. ముంబయికి చెందిన షిజి పుయత్(45) మల్కాపురంలోని శ్రీహరిపురంలో ఉంటూ, ఆటోనగర్‌లోని శ్రీసాయి కాలిబ్రిషన్ అనే ప్రైవేట్ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం తన స్కూటీపై విధులకు బయల్దేరాడు. శ్రీహరిపురం నుంచి గాజువాక వెళ్తుండగా మోహిని థియేటర్ వద్ద ముందుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు ఆవు అడ్డురావడంతో బస్సును డివైడర్ వైపు డ్రైవర్ తిప్పాడు. అదే సమయంలో బస్సుకు, డివైడర్‌కు మధ్యనున్న ఖాళీ నుంచి బస్సు దాటేందుకు పుయత్ ప్రయత్నిస్తున్నాడు. బస్సు ఒక్కసారిగా డివైడర్ వైపు మళ్లడంతో స్కూటీ బస్సుకు తగిలి, వాహనంతో సహా వెనుక చక్రాల కిందికి వెళ్లిపోయాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని బస్సును స్టేషన్‌కు తరలించారు. మృతుని భార్య రేష్మా పుయత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు. మృతునికి ఓ కుమార్తె, వృద్ధులైన తల్లిదండ్రులు ఉన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

చింతపల్లి: మండలంలోని చెదలపాడు గ్రామంలో ఓ వృద్ధుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. చెదలపాడు గ్రామానికి చెందిన కిముడు మోహన్‌రావు (59) కుమారుడి వద్ద ఉంటున్నాడు. అతని భార్య ఏడాది కిందట మరణించింది. అప్పటి నుంచి మోహన్‌రావు మానసికంగా బాధపడుతున్నాడు. ఆదివారం రాత్రి మోహన్‌రావు మద్యం తాగి ఇంటికి వచ్చాడు. కొంత సమయానికి వాంతులు చేసుకున్నాడు. అయితే అతని నుంచి పురుగు మందు వాసన రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఏజెన్సీకి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

- ఆదివాసీ నిరుద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు
- రంపచోడవరంలో విద్యార్థి సంఘాల ఆందోళన



రంపచోడవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ నిరుద్యోగులు, నాయకులు

రంపచోడవరం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏజెన్సీకి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని, జీవో నంబర్ 3 ని పునరుద్ధరించాలని ఆదివాసీ నిరుద్యోగులు, ఆదివాసీ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. జీవో నంబర్ 3ని పునరుద్ధరించి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రంపచోడవరంలో భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించి, ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆదివాసీల చట్టాలను, హక్కులు పాలకులు నీరుగార్చడమే కాకుండా మరోపక్క ఉద్యోగ అవకాశాలను లేకుండా చేయడానికి చూస్తున్నారని విమర్శించారు. మెగా డీఎస్సీ వద్దు.. ఏజెన్సీ డీఎస్సీ ముద్దు అని నినాదాలు చేశారు. ఫోన్‌లో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం మాట్లాడుతూ ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో ధర్నా ముగించారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నాయకులు చందు, అశోక్, నవీన్, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోత రామారావు, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, డివిజన్ చైర్మన్ పందుల కామరాజు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు సోడే మురళి, బంగారు వెంకటేశ్వర్లు, తీగల బాబూరావు, వంతు బాలకృష్ణ, రంపచోడవరం జెడ్పీటీసీ పండ వెంకటలక్ష్మి, ఎంపీపీ బందం శ్రీదేవి, సంతోష్ , శ్రీను, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి కుమార్

పాడేరు : తల్లిదండ్రుల యొక్క పోషణ, సంరక్షణను పిల్లలు విస్మరిస్తే వారి ద్వారా సంక్రమించిన ఆస్తులను తిరిగి పొందే హక్కులను వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పి.ఎస్.కుమార్ సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి అధ్యక్షతన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వృద్ధుల సంరక్షణ పట్ల కుటుంబ సభ్యులు **ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి** మాట్లాడుతూ వృద్ధుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సైబర్ నేరాలపై వృద్ధులకు అవగాహన కల్పించారు. సీనియర్ సిటిజన్స్ సంఘం అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ వృద్ధులకు బ్యాంకు రుణాల మంజూరు విషయంలో ప్రభుత్వ కార్యాలయాల్లోని సంబంధిత పనులపై **ఆటంకం లేకుండా చూడాలని కోరారు.** ఈవోపీఆర్డీ రమేష్, గ్రామ సచివాలయ,తదితరులు పాల్గొన్నారు.

విశాఖ నుంచి ఆర్‌బీఐ ఔట్!



- విజయవాడలో ఏర్పాటుకు నిర్ణయం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వైజాగ్‌లో భవనాన్వేషణ
- 500 మంది ఉద్యోగులతో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు నిర్ణయం
- 35 వేల చ.అడుగుల భవన ఎంపికకు తుది అడుగులు
- ప్రభుత్వం మారిన తర్వాత పట్టించుకోని చంద్రబాబు
- చివరికి విజయవాడలో ఏర్పాటు చేయాలని ఒత్తిడి తీసుకొచ్చిన కూటమి ప్రభుత్వం
- విజయవాడలో అద్దె భవనం కావాలంటూ టెండర్ నోటిఫికేషన్ జారీ

సాక్షి, విశాఖపట్నం : ఆర్థిక రాజధానిగా విశాఖను అభివృద్ధి చేస్తానంటూ దశాబ్దాలుగా బాకా కొట్టిన చంద్రబాబు.. ఇప్పుడు ఇక్కడ ఏర్పాటు కానున్న రిజర్వ్ బ్యాంక్‌ను మాత్రం తరిమేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తన ప్రాంతీయ కార్యాలయాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని భావించి.. భవన అన్వేషణ ప్రక్రియ ప్రారంభించింది. ఇక ఆర్‌బీఐ ఏర్పాటు లాంఛనమే అన్న తరుణంలో ప్రభుత్వం మారిపోయింది. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం దీని గురించి పట్టించుకోలేదు. సేవలు ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్న నేపథ్యంలో ఆర్‌బీఐని విజయవాడలో ఏర్పాటు చేసేలా కేంద్రంపై చంద్రబాబు ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో రీజనల్ కార్యాలయ ఏర్పాటుకు అద్దె భవనం కావాలంటూ ఆర్‌బీఐ టెండర్లు ఆహ్వానించింది. ఎన్నికల ముందు విశాఖపై అలవిమాలిన ప్రేమ కురిపించిన చంద్రబాబు, పవన్.. ఇప్పుడు అన్ని రంగాల్నీ ఇక్కడ నుంచి దూరం చేసేందుకు కుట్ర పన్నుతున్నారనడానికి ఇదో ప్రత్యక్ష ఉదాహరణ. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలను హైదరాబాద్‌లోని రిజర్వ్ బ్యాంక్ కార్యాలయం నుంచే సాగించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ నిర్వహించే సమావేశాలకు హైదరాబాద్ నుంచే అధికారులు విజయవాడకు వచ్చేవారు. దీనివల్ల పరిపాలన సౌలభ్యం కష్టసాధ్యమవుతుందని భావించి.. ఏపీకి ప్రత్యేక రీజనల్ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఆర్‌బీఐ ఉన్నతాధికారులు 2023లో ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కీలక నగరంగా ఉన్న విశాఖపట్నం వైపు అధికారులు మొగ్గు చూపారు.

500 మంది ఉద్యోగులతో...

రీజనల్ ఆఫీస్ ఏర్పాటు చేసేందుకు నగర పరిధిలో దాదాపు 30 వేల చ.అడుగుల విస్తీర్ణం ఉన్న భవనం అవసరమని అప్పటి జిల్లా కలెక్టర్‌తో సంప్రదింపులు జరిపారు. 500 మంది ఉద్యోగులతో ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటుకు అవసరమైన ప్రాంతం కావాలని ప్రతిపాదించారు. కార్యాలయ నిర్మాణానికి ఏపీఐఐసీకి చెందిన స్థలం సిద్ధంగా ఉందని సూచించినా.. వెనువెంటనే కార్యకలాపాలు ప్రారంభించాలని.. అందుకే నిర్మాణం పూర్తయిన భవనమే అవసరమని ఆర్‌బీఐ అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో నగరంలో మధురవాడ, రుషికొండ, ఆరిలోవ, కొమ్మాది, భీమిలి, హనుమంతువాక, కైలాసగిరి, సాగర్‌నగర్ పరిధిలోని పలు భవనాలను పరిశీలించారు. చివరికి ఎంవీపీ కాలనీ, సీతమ్మధార, మధురవాడ ప్రాంతాల్లో భవనాలను ఈ ఏడాది జనవరిలో ఎంపిక చేశారు. ఉన్నతాధికారులు పరిశీలించిన అనంతరం మూడింటిలో ఒక భవనాన్ని ఎంపిక చేసి కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఆర్‌బీఐ సమాయత్తమైంది. ఇంతలో ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారిపోవడం చకచకా జరిగిపోయాయి.

విశాఖ వెళ్లేందుకు వీల్లేదు..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఆర్‌బీఐ ఏర్పాటుకు విశాఖ అనుకూలమని అధికారులు భావించారు. దీనిపై రిజర్వ్ బ్యాంకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఎట్టిపరిస్థితుల్లోనూ రిజర్వ్ బ్యాంక్ విశాఖలో ఏర్పాటు కాకూడదని పట్టుబట్టినట్లు తెలుస్తోంది. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరిపారు. విజయవాడలోనే ఆర్‌బీఐ రీజనల్ కార్యాలయం ఏర్పాటు చెయ్యాలని విశాఖ వెళ్లేందుకు వీల్లేదని కరాఖండిగా చెప్పినట్లు సమాచారం. దీంతో విశాఖలో రీజనల్ కార్యాలయం ఏర్పాటుకు ఆర్‌బీఐ బ్రేక్ వేసింది. చేసేది లేక విజయవాడలోనే ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటోంది. ఇందులో భాగంగానే ఏపీ రీజనల్ కార్యాలయం(ఏపీ ఆర్‌వో) ఏర్పాటు చేసేందుకు అవసరమైన 20 వేల నుంచి 28 వేల చ.అడుగుల విస్తీర్ణం గల అద్దె భవనం కావాలంటూ టెండర్ నోటిఫికేషన్‌ను ఆదివారం జారీ చేసింది. ఈ నెల 25లోపు టెండర్లు దాఖలు చేసుకోవాలంటూ షరతులు విధిస్తూ అన్వేషణ ప్రారంభించింది. దీంతో విశాఖ నుంచి ఆర్‌బీఐ రీజనల్ కార్యాలయం అవుట్ అయిపోయినట్లేనని స్పష్టమైపోయింది.

ఓవైపు ఆర్థిక రాజధానిగా విశాఖని తీర్చిదిద్దుతానంటూ మైక్ దొరికిన చోటల్లా ఊదరగొట్టిన చంద్రబాబు చివరికి విషమంతా కక్కుతూ ఆర్థిక అవసరాలు తీర్చే ఆర్‌బీఐని వైజాగ్‌కు రాకుండా చేయడంపై నగర ప్రజలు, వాణిజ్య వేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా ఒక్కో సంస్థను విశాఖ నుంచి దూరం చేసి ఒంటరి నగరంగా మార్చేందుకు జరుగుతున్న కుట్రలో భాగంగా.. ఆర్‌బీఐ మొదటి అడుగని అంతా భావిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.